క్లుప్తంగా

ఘనంగా సుదర్శన జయంతి



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై మంగళవారం అంగరంగ వైభవంగా శ్రీ సుదర్శన జయంతి మహోత్సవాన్ని నిర్వహించారు. జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళ శాసనాలతో, అహోబిల రామానుజస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 9 గంటలకు శ్రీ సుదర్శన నరసింహ పెరుమాళ్లకు అభిషేకం, అలంకరణ, సుదర్శన మహా యాగం సీతారాముల నిత్య కల్యాణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా కనుల పండువగా నిర్వహించామని తెలిపారు. శత్రుబాధ నివారణ కోసం సుదర్శన మహాయాగం నిర్వహించినట్లు వివరించారు. అనంతరం భక్తుల కు తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించినట్లు తెలిపారు.

పత్తిలోడు మినీలారీ బోల్తా

ఒకరికి తీవ్ర గాయాలు



ఫిరంగిపురం: పత్తి లోడుతో వెళుతున్న మినీలారీ ప్రమాదవశాత్తూ ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రేపూడి గ్రామశివారులో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగార్జునసాగర్ నుంచి పత్తి లోడుతో గుంటూరు వెళుతున్న మినీలారీ ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామ శివారు వద్ద ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్ వైపు తిప్పడంతో బోల్తాపడింది. వాహనంలో ప్రయాణిస్తున్న అనిల్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని ప్రైవేటు వాహనంలో చికిత్స కోసం తరలించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి లలిత

మంగళగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి లలిత అన్నారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులు ప్రక్రియపై వీఆర్‌ఓ, వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌ఓలను ఓటర్లకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఓటర్లు వినియోగించుకుని తమ ఓటును ఓటర్ల జాబితాలో సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి లతో పలువురు వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీలకు జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీలకు అధికారులు జరిమానా విధించారు. తెనాలి మండలం కొలకలూరు వద్ద నందివెలుగు–గుంటూరు రహదారిపై అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం. సిబ్బంది మంగళవారం గుర్తించారు. లారీ యజమానులకు జరిమానా విధించారు.

లివర్ సమస్యలను ముందుగా గుర్తించొచ్చు

గుంటూరు మెడికల్: ఫైబ్రో స్కాన్ ద్వారా లివర్ సమస్యలను ముందస్తుగానే గుర్తించి చికిత్స చేయవచ్చని కేర్‌వెల్ హాస్పటల్‌కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ షేక్ నాగూర్‌బాషా చెప్పారు. మంగళవారం స్థానిక గుంటూరువారితోట 7వలైనులోని కేర్‌వెల్ హాస్పటల్‌లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ నాగూర్ బాషా మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో సుమారు రూ. 10వేలు ఖరీదు చేసే ఫైబ్రో స్కాన్‌ను 90 మందికి ఉచితంగా చేశామన్నారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కొద్దిరోజుల్లోనే మరో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, లివర్ సంబంధిత సమస్యలు తెలుసుకోవాలనుకునేవారు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా కోరారు.

ప్రసన్నాంజనేయస్వామికి నాగవల్లీ దళార్చన

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అధిక శ్రావణమాస మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ప్రసన్న, వినయ్‌కుమార్‌లు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామార్చనలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

జగనన్న సురక్ష విజయవంతం

- తెనాలి మున్సిపాలిటీలో పరిధిలో విశేష స్పందన
- మొత్తం 9,320 ధృవీకరణ పత్రాల పంపిణీ



పట్టణ 7, 8 వార్డుల సభలో సర్టిఫికెట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే శివకుమార్ (ఫైల్)

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి పట్టణంలో విశేష స్పందన లభించింది. పట్టణంలో నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో వివిధ రకాల 9,320 సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు అందజేశారు. మున్సిపాలిటీ ముద్రించి ఇచ్చిన దరఖాస్తులతో వలంటీర్లు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయించారు. రోజుల వ్యవధిలోనే వారికి కనీసం దరఖాస్తు పత్రం ఖర్చు కూడా లేకుండా సురక్ష సభల్లో ఆయా సర్టిఫికెట్లను అందజేయటంతో అంతటా సంతోషం వ్యక్తమవుతోంది.

సమస్యల పరిష్కారానికే...

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగానే జగనన్న సురక్షను ప్రభుత్వం తీసుకొచ్చింది. 85 శాతం మందికి సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతి ఇంటినీ సందర్శించి, ఆ కుటుంబానికి ఇచ్చిన సంక్షేమాన్ని తెలియజేయటం, ఇంకా ఏవైనా సమస్యలుంటే తెలుసుకునేందుకు ‘గడపగడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని ఆదేశించింది. గత 10–11 నెలలుగా ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ప్రతి ఇంటి తలుపునూ తడుతున్నారు. ఆ క్రమంలో ప్రజల నుండి వచ్చిన సూచన/వినతులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. వివిధ పథకాలకు దరఖాస్తు చేసేందుకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ప్రజలకు సాధ్యమైనంత తొందరగా, ఉచితంగా అందజేయాలని సంకల్పించింది. ఫలితంగానే జగనన్న సురక్ష పేరుతో మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టి, విజయవంతంగా ముగించింది.

ఇంటి వద్దకే సేవలు...

గత నెల 23న ఈ కార్యక్రమం ఆరంభమైంది. వార్డు వలంటీర్లు తమకు కేటాయించిన 50–60 ఇళ్లను సందర్శించి, ప్రజల అవసరాలను ముందుగా సర్వే చేశారు. వారికి కావాల్సిన సర్టిఫికెట్లకు దరఖాస్తు చేయించారు. ఇందుకోసం మున్సిపల్ అధికారులు దరఖాస్తులును ముద్రించి, ఉచితంగా అందజేశారు. అనంతరం ఈనెల నాలుగో తేదీ నుంచి పట్టణంలో జగనన్న సురక్ష సభలను నిర్వహించారు. మున్సిపల్ అధికారులతో మూడు బృందాలు ఏర్పాటయ్యాయి.

ప్రజలకు అందిన సేవల వివరాలు ఇలా ఉన్నాయి...

పట్టణంలో మొత్తం ఇచ్చిన సర్టిఫికెట్లు	: 9320
వివిధ కారణాలతో తిరస్కరించినవి	: 157
ఆదాయ ధృవీకరణపత్రం	: 3822
కులధృవీకరణ పత్రం	: 4635
జనన ధృవీకరణ	: 02
మరణ ధృవీకరణ	: 01
వివాహ సర్టిఫికెట్	: 07
కొత్త బియ్యం కార్డులు	: 114
బియ్యం కార్డు విభజన	: 58
బియ్యం కార్డులో పేరు చేర్చడం	: 126
బియ్యం కార్డులో పేరు తొలగింపు	: 06
ఫ్యామిలీ సర్టిఫికెట్	: 103
ఆధార్ మొబైల్ లింక్	: 409
ఈబీసీ సర్టిఫికెట్	: 16
ఇతర సర్టిఫికెట్లు	: 21

ఆయా బృందాల నేతృత్వంలో సురక్ష సభలు జరిగాయి. పట్టణంలో 43,604 ఇళ్లు, మొత్తం 47 సచివాలయాలు ఉన్నాయి. రెండేసి సచివాలయాలకు ఒకటి చొప్పున మొత్తం 23 సురక్ష సభలు జరిగాయి. ఒక్కో సభను ఒక్కో మున్సిపల్ అధికారుల బృందం నిర్వహించింది. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, సంబంధిత వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లోనే కుల, ఆదాయ ధృవపత్రం....



గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు వలంటీర్లే ఇంటికి వచ్చి వివరాలు రాసుకుని అవసరమైన పత్రాలు తీసుకుని వెళ్లారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశాను. కేవలం రోజుల వ్యవధిలోనే ఉచితంగా ఇచ్చారు.

– పోల భాను, మారీసుపేట

రూపాయి ఖర్చు లేకుండా ధృవపత్రం



ఇప్పుడు ప్రభుత్వం ఇంటి ముందుకు వచ్చినట్టుంది. ఏం కావాలో ఇంటికి వచ్చి మరీ అడుగుతున్నారు. అవసరమైన వాటికి దరఖాస్తు చేయిస్తున్నారు. వారంలోపే నాకు కులధృవీకరణ పత్రం ఇచ్చారు. అదికూడా రూపాయి ఖర్చు లేకుండా. చాలా సంతోషంగా ఉంది.

– మజ్జి శ్రీలక్ష్మి, 24వ వార్డు

భూముల రీసర్వేకు పురప్రజలు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ వినతి



మాట్లాడుతున్న ఏసీపీ సుధాకర్

తెనాలి: కేంద్రప్రభుత్వ ‘స్వమిత్వా’, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ‘జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా తెనాలి పట్టణంలో రీసర్వే జరుగుతోందని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. 1920లో జరిగిన సమగ్ర భూసర్వేని ప్రభుత్వం ఆదేశాల ప్రకారం తిరిగి అన్ని ప్రైవేటు, ప్రభుత్వ భూముల రీసర్వ చేస్తున్నట్టు తెలిపారు. సర్వే బృందాలైన సచివాలయ సిబ్బంది మీ వద్దకు వచ్చినపుడు వారికి మీ రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు జీరాక్స్ కాపీలను ఇచ్చి, మీ భూమి సరిహద్దులు చూపించి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. రీసర్వేలో ఎలాంటి రుసుము లేకుండా మీ ఆస్తిని సర్వే చేసి, సర్వే నంబరు, డిజిటల్ హక్కు పత్రం ఇస్తారని వివరించారు. పురప్రజలు అందరూ ఈ కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు.

సర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా చూడండి

తెనాలిఅర్బన్: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా తెనాలి పట్టణంలో జరిగే భూసర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ జడ్.సుధాకర్ చూడాలని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులతో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్వే చేపట్టిందన్నారు. తెనాలి పట్టణంలో ఉన్న ప్రభుత్వ, ప్రవేటు భూములను సర్వే చేయడంతో పాటు వారి నుంచి రిజిష్టర్ డాక్యుమెంట్లు నకలు కాపీలను తీసుకోవాలని చెప్పారు. నేటి నుంచి సర్వే చేయాలన్నారు. ప్రవేట్ స్థల యాజమానులకు ఇవ్వాల్సిన నోటీసులను వారికి వెంటనే అందజేయాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ–2 సుబ్బారావు, టీపీవో సాంబశివరావు, వీఆర్వోలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యాసంస్థల బంద్



నినాదాలు చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

తెనాలి: విద్యాసమస్యల పరిష్కారం కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రబంద్‌లో భాగంగా తెనాలిలో విద్యాసంస్థల బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఉదయమే పలు కూడలి ప్రాంతాల్లోకి చేరుకుని, వివిధ విద్యాసంస్థల బస్సులను అడ్డుకున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించగా, తెరిచివున్న పాఠశాలల్ని ఏఐఎస్‌ఎఫ్ కార్యకర్తలు మూసివేయించారు. కొన్నిచోట్ల విద్యార్థులను బలవంతంగా బయటకు పంపడంతో పోలీసులు, సమాఖ్య నాయకులకు వాగ్వాదం జరిగింది. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, తెనాలి కన్వీనర్ మద్దినేని కిరబాబు, పట్టణ కార్యదర్శి చెన్నూరు సాయి, సహాయ కార్యదర్శి శ్రీను, యశ్వంత్, గోరంట్ల కళ్యాణ్, పల్నాటి నాగరాజు, బిల్లా రాజేష్ తదితరులు పర్యవేక్షించారు.

రెడ్‌క్రాస్‌చే బ్లడ్ స్టోరేజి సెంటర్



స్టోరేజి సెంటరు పరిశీలిస్తున్న ఖేలదా నసీమ్, పక్కన భానుమతి

తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఇక్కడి కొత్తపేటలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బ్లడ్ స్టోరేజి సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.70 లక్షలను వెచ్చించనున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ఆ ప్రదేశాన్ని సందర్శించారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా పట్టణ, పరిసరాల్లోని ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తం సమకూర్చేందుకు రెడ్‌క్రాస్ రక్తనిధిని ఏర్పాటు చేయనున్నట్టు చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ వెల్లడించారు. రక్తనిధి ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు తోడ్పడవచ్చని చెప్పారు. రక్తనిధి ఏర్పాటుకు తమ సమావేశంలో తీర్మానించిన విషయాన్ని తెలియజేసిన వెంటనే ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పందించారని రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి చెప్పారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రత్యేకంగా ఒక గదిని ఇందుకు నిర్ణయించినట్టు ఎమ్మెల్యే తెలియజేశారని చెబుతూ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. వీరితో మున్సిపల్ ఏఈ ఫణీంద్ర, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు

బోధన పద్ధతులు మెరుగుపరుచుకోండి

ఎంఈఓ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: బోధన పద్ధతుల్లో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని ఎంఈవో–1 మేకల లక్ష్మీనారాయణ సూచించారు. ఎన్‌సీఆర్ ఎన్‌ఎంహెచ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్కూల్ కాంప్లెక్స్ ట్రైనింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. బోధన పద్ధతులు మెరుగుపరుచుకోవడానికి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. అలాగే అకాడమిక్ పనితీరును సమీక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. సమావేశంలో పాఠశాలల కాంప్లెక్స్ చైర్మన్ ఎమ్‌డి.బషీర్ అహ్మద్, రిసోర్స్‌పర్సన్ షేక్ షరీఫ్, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ కె.శ్యామ్‌బాబు, సీహెచ్.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు తోడ్పాటు

నెహ్రూనగర్: పెయింటింగ్ కళాకారులకు నగర పాలక సంస్థ తరఫున తగిన తోడ్పాటునందించడానికి చర్యలు తీసుకుంటామని నగర మే యర్ కావటి మనోహర్‌నాయుడు తెలిపారు. మంగళవారం ది పెయింటింగ్ (ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నగర పాలక సంస్థ చేపట్టే పెయింటింగ్ పనులను తమకు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి పనులలో భాగంగా చేపడుతున్న పెయింటింగ్ పనులను దిపెయింటింగ్(ఆర్ట్స్) వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జీవనోపాధికై తమకు కేటాయించాలని కోరారని, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులను ఆదేశించామన్నారు.

పేదలకు జగనన్న సురక్షతో ఎంతో మేలు



సర్టిఫికేట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తెనాలిటౌన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల ఎంతో మంది పేదలకు మేలు జరుగుతున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ హెనాప్రియ తెలిపారు. రూరల్ మండలం గుడివాడ గ్రామంలో సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సభలో ఇన్‌చార్జి తహసీల్దార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్‌లు అందజేస్తున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే వివిధ రకాల సేవలను పొందవచ్చని, ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ యడ్లపాటి రాకేష్, కోపల్లె సర్పంచ్ చింతలకుమారి, ఎంపీటీసీ సభ్యులు కారుమంచి కిషోర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో హైమావతి, ఏఎన్ఎం చంపవల్లరి, ఝాన్సీ, మంజు, అనూష, రవి, ఉమామహేశ్వరరావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

- మృతుడి స్వస్థలం పశ్చిమ బెంగాల్
- విలపిస్తున్న తల్లిదండ్రులు



బిల్డింగ్‌పై నుంచి దూకడంతో మృతి చెందిన బీటెక్ విద్యార్థి సొరదీప్ చౌదరి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యార్థి హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మదీన్ జిల్లా కొత్తపల్లికి చెందిన హోమియో డాక్టర్ సుధీర్‌చౌదరి తన కుమారుడు సొరదీప్ చౌదరిని(19) గత సోమవారం ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో చేర్పించారు. అప్పటి నుంచి హాస్టల్‌లో ఉంటున్నాడు. సుధీర్ చౌదరి, అతని భార్య గత శుక్రవారం ఇక్కడి నుంచి స్వగ్రామం వెళ్లారు. అప్పటి నుంచి సొరదీప్ చౌదరి మిమ్మల్ని విడిచి దూరంగా ఉండలేనని, ఇంటికి వచ్చేస్తానని అంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో పాటు మెసేజ్‌లు పెట్టినా స్పందించలేదు. చివరకు ఆదివారం ఆత్మహత్య చేసుకుంటానని అంటూ మెసేజ్ పెట్టినా తల్లిదండ్రుల నుంచి సమాధానం లేకపోవడంతో కళాశాల హాస్టల్ 11వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై కళాశాల యాజమాన్యం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సొరదీప్ చౌదరి మృతి చెందడంతో తండ్రి సుధీర్ చౌదరి నా కొడుకును నేను చంపుకున్నానంటూ బోరున విలపించాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పశ్చిమ బెంగాల్‌లోని స్వగ్రామానికి తరలించారు.

కార్పొరేట్ విద్యాసంస్థల మనుగడ కోసమే బంద్

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు జూపూడి జాన్సన్

తాడేపల్లిరూరల్: కార్పొరేట్ విద్యాసంస్థల మనుగడ కోసమే ప్రతిపక్షాల పోరాటమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు జూపూడి జాన్సన్ అన్నారు. దుగ్గిరాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న వారు విద్యార్థుల భవిష్యత్తు కోసం కాకుండా కార్పొరేట్ పాఠశాలల లబ్ధికోసమే బంద్‌కు పిలుపునిచ్చారని అన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఖర్చు చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.67 వేల కోట్ల నిధులను విద్యకోసం ఖర్చుచేశారని అన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన, మొట్టమొదటి సారిగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారని, పాఠశాల ప్రారంభమైన మొట్టమొదటి రోజునే విద్యార్థులకు పుస్తకాలు, టెస్ట్‌బుక్స్, యూనిఫామ్ అందజేశారని అన్నారు. రాష్ట్రంలో అక్షరాస్యత శాతం పెంచాలన్న ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, వాటిలో భాగంగా అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, నాడు నేడు, జగనన్న విద్యాకానుక, వసతి దీవెన వంటి పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



సీపీఎం సంస్థల నిరసన ప్రదర్శన

కొల్లిపర: మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న ఘటనలు అమానవీయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటనలను నిరసిస్తూ మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలువురు కొల్లిపర పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, మౌన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్ ఘటన మానవ సమాజాన్ని కలచివేస్తోందన్నారు. రెండునెలలకు పైగా అక్కడ హింసాకాండ, ఘర్షణలు, అత్యాచారాలు జరుగుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మణిపూర్ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో గల 3 ప్రధాన రాజకీయ పార్టీలు ఆంతర్య మేమిటని ప్రశ్నించారు. నిరన ర్యాలీలో సిఐటియు మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్ , ఏఐటియుసి నాయకులు పి.బాలస్వామి ,ముద్దన సాంబశివరావు, అంగన్‌వాడీ మండల కార్యదరిశ జి.నిర్మలా జ్యోతి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లోల రమేష్, జి.సుందరరావు, పి.ఏసుపాదం, శేషం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మణిపుర దారుణాలపై నిరసన ప్రదర్శన

తెనాలి: మణిపురలో మహిళల ధన, మాన, ప్రాణాలను కాపాడాలని, రాజ్యాంగ వ్యవస్థలు పనిచేసి మానవ మృగాలను కట్టడిచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, ఐద్వా, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. మున్సిపల్ మార్కెట్ వద్ద గల అన్నాబత్తుని సత్యనారాయణ పురవేదిక నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా గాంధీచౌక్ వరకు ప్రదర్శన సాగించింది. మున్సిపల్ కార్మికులు, తపాల యూనియన్ సభ్యులు, మైనారిటీ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ఈ ప్రదరసనలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఒక తెగవారిపై జరిగిన మూకదాడులు, మహిళలపై అత్యాచారాలను నిరోధించడంలో మణిపుర రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైనట్టు సీపీఎం కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ అన్నారు. మణిపురలో మహిళలపై హింసను, వారి మానప్రాణాలను కాపాడలేని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి డిమాండ్ చేశారు. ముందుగా మూకదాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రదర్శనలో మంగళగిరి వెంకటేశ్వర్లు, రాచూరి వెంకటేశ్వర్లు, మాధవి, గౌరి, సునీత, సుజాత, అనూరాధ, శారమ్మ, షబ్బీర్, మరియమ్మ, డి.శంకరరావు, అన్సారీ పాల్గొన్నారు.

మణిపుర ఘటనలపై నిరసన

తెనాలి: మణిపురలో జరిగిన అమానవీయ ఘటనలు దారుణమంటూ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు ధారా రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ముత్యంశెట్టిపాలెంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, మణిపురంలో 79 రోజులకు పైగా ఒక వర్గం వారిపై మూకదాడులు, మహిళలపై సామూహిక అత్యాచారాలు జరుగుతున్నా, కేంద్రప్రభుత్వం స్పందించనే లేదని విమర్శించారు.

మణిపూర్‌లో మహిళలపై జరిగే దాడులను అరికట్టాలి

తెనాలిఅర్బన్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను భారతీయులందరూ ఖండించాలని ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. మణిపూర్‌లో మహిళలపై అల్లారుముక్కలు అమానుషంగా దాడిచేస్తున్నాయని తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మణిపూర్ దుర్మార్గానికి కేంద్రం బాధ్యత వహించాలి

తెనాలిటౌన్: మణిపూర్‌లో కుకీ గిరిజన మహిళలపై జరుగుతున్న సామూహిక అత్యాచారాలు, మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దీనికంతటికి ప్రధానమంత్రి నరేంద్ర మోడి, హోంమంత్రి అమిత్‌షాలు బాధ్యత వహించాలని క్రైస్తవ మైనారిటీ హక్కుల పరిరక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గోరికపూడి బాలరాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని బాలరాజు కోరారు.

ఎడతెరిపిలేని వాన

కొల్లిపర: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవంతో పలు గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంట వర్షం నీరు ఎక్కువగా ఉండి రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు చేరడంతో రాకపోకలకు ప్రయాణికులు , వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వర్షం వరిసాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగపడనుంది. నారుమడులు ఎదుగుదలకు, ఆకుతీతకు, దమ్ము చేయడానికి, నాట్లు వేయడానికి వీలుగా పొలం మడులలో నీరు చేరింది. ఇప్పటికే వరి వెద పద్ధతిలో పెట్టిన రైతులు, మెట్ట పై పసుపు నాటిన రైతులు ఈవర్షం ఊపిరిపోసిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విత్తన, ఎరువుల ఎంపికలో మెలకువలు పాటించాలి

కొల్లిపర: వరి విత్తనాలు, ఎరువులు, మందులు ఎంపికలో రైతులు మెలకువలు పాటించాలని ఏఓ కె.వెంకటరావు సూచించారు. ఈసందర్భంగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. కొన్న తరువాత రసీదు తప్పనిసరిగా పొందాలని సూచించారు. వ్యవసాయ సంబంధిత సమాచారం కోసం స్థానిక ఆర్బీకేలను సంప్రదించాలని రైతులకు సూచించారు.